
# రాణి అల్విదా

**16 ఏండ్ల హాకీ కెరీర్‌కు వీడ్కోలు పలికిన మాజీ సారథి**



ఢిల్లీ: భారత హాకీ జట్టు మాజీ సారథి రాణి రాంపాల్ అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. 16 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు గురువారం తెలిపింది. భారత్ తరపున 254 మ్యాచ్‌లు ఆడి 205 గోల్స్ చేసిన రాణి.. 14 ఏండ్ల వయసులోనే (2008లో) అంతర్జాతీయ స్థాయిలో అరంగేట్రం చేసింది. హర్యానాలోని అత్యంత పేద కుటుంబంలో పుట్టిన రాణి ఎన్నో ఒడిదొడుకులను దాటుకుని అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. రాణి సారథ్యంలో భారత జట్టు 2018 హాకీ వరల్డ్‌కప్‌లో క్వార్టర్స్ చేరడమే గాక అదే ఏడాది ఆసియా క్రీడల్లో రజతం నెగ్గింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలవడంలోనూ రాణి పాత్ర కీలకం. 29 ఏండ్ల వయసులోనే కెరీర్‌కు గుడ్ బై చెప్పిన రాణిని 2020లో కేంద్ర ప్రభుత్వం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్నతో పాటు పద్మశ్రీ అవార్డులతో సత్కరించింది.

## బాక్సింగ్ అకాడమీ ఏర్పాటు చేస్తా



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించడమే తన లక్ష్యమని భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ పేర్కొంది. లాస్‌ఏంజిల్స్(2028) వేదికగా జరిగే ఒలింపిక్స్‌లో కచ్చితంగా పతకం సాధిస్తానని నిఖత్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసింది. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న నిఖత్ పలు అంశాలపై మాట్లాడుతూ 'ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించకపోవడం చాలా నిరుత్సాహానికి గురిచేసింది. ఒలింపిక్ పతకం సాధించడం కోసం చాలా కష్టపడాను. కానీ ప్రతికూల డ్రా నా ఆటపై ప్రభావం చూపించింది. రానున్న ఆసియా, కామన్వెల్త్ గేమ్స్‌లో రాణించడంపై దృష్టి పెడతాను. నాకు వ్యక్తిగత కోచ్‌ను నియమిస్తే హైదరాబాద్‌లోనే ప్రాక్టీస్ చేసుకుంటాను. ఇక్కడ సరైన ఇండోర్ బాక్సింగ్ అకాడమీ సదుపాయాలు లేవు కాబట్టి.. ఇందుకోసం స్థలం కావాలని ప్రభుత్వాన్ని కోరాను. ఇందులో నాలాంటి చాలా మంది బాక్సర్లు, యువత కోచింగ్ తీసుకోవచ్చు. డీఎస్పీ జాబ్ ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అని అంది.

## అమ్మాయిల బోణీ

అహ్మదాబాద్: భారత మహిళా క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ దీప్తిశర్మ (41, 1/35) ఆల్‌రౌండ్ షోతో అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమ్‌ఇండియా ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన మొదటి వన్డేలో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. 44.3 ఓవర్లలో 227 పరుగులు చేసింది. తేజల్ హసబ్నిస్ (42), దీప్తి, యస్తికా భాటియా (37) రాణించారు. అనంతరం ఛేదనలో న్యూజిలాండ్ అమ్మాయిలు 40.4 ఓవర్లలో 168 పరుగులకే కుప్పకూలారు. స్పిన్నర్ రాధా యాదవ్ (3/35), అరంగేట్ర పేసర్ సైమా ఠాకూర్ (2/26) కివీస్‌ను దెబ్బకొట్టారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

## సుప్రీంలో హెచ్‌సీఏ కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబర్24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) వ్యవహారాలపై జస్టిస్ లావు నాగేశ్వర్ రావు సమర్పించిన నివేదికపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. ఏక సభ్య కమిటీ నివేదికపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సతీశ్‌చంద్రశర్మతో కూడిన ప్రత్యేక ధర్మాసనం గురువారం జరుపాల్సిన విచారణ కొనసాగలేదు. హెచ్‌సీఏలో 57 క్రికెట్ క్లబ్‌లలో కొంత మంది కుటుంబ సభ్యుల ఆధిపత్యానికి చెక్ పెడుతూ జస్టిస్ నాగేశ్వర్ రావు సుప్రీం కోర్టుకు ఇది వరకే నివేదిక సమర్పించారు. తమ క్లబ్‌లపై నిషేధాన్ని సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై గత కొన్ని నెలలుగా విచారణ సాగుతున్న సంగతి తెలిసిందే.

## సఫారీలదే తొలి టెస్టు

ఢాకా: బంగ్లాదేశ్ పర్యటనలో ఉన్న దక్షిణాఫ్రికా తొలి టెస్టులో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఓవర్‌నైట్ స్కోరు 283/7 వద్ద నాలుగో రోజు ఆట ఆరంభించిన బంగ్లాదేశ్.. సౌతాఫ్రికా పేసర్ రబాడా (6/46) ధాటికి 307 పరుగులకు ఆలౌట్ అయింది. మిరాజ్ (97) తృటిలో శతకాన్ని కోల్పోయాడు. అనంతరం 106 పరుగుల విజయలక్ష్యాన్ని సౌతాఫ్రికా 22 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. టోనీ డి జార్జి (41), ట్రిస్టన్ స్టబ్స్ (30 నాటౌట్) రాణించారు.

## రెండో టెస్టులో భారత్ గెలుపు

ఢిల్లీ: సారథి హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్ చెరో రెండు గోల్స్ చేయడంతో జర్మనీతో ఢిల్లీలో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌ను భారత హాకీ జట్టు 5-3తో గెలుచుకుంది.జర్మనీ తరపున మజ్‌కోర్ (7, 57వ ని.) రెండు గోల్స్ చేయగా మెర్ట్‌జెన్స్ (60 ని.) ఓ గోల్ కొట్టాడు. తొలి అర్ధ భాగంలో గోల్స్ నమోదుచేయలేకపోయిన భారత్.. సెకండాఫ్‌లో మాత్రం రాణించింది. సుఖ్‌జ్యోత్ (34,48 ని.), హర్మన్‌ప్రీత్ (42, 43 ని.), అభిషేక్ (45ని.) గోల్స్ చేశారు. సిరీస్ డ్రా తో విజేతను నిర్ణయించే షూటౌట్‌లో భారత్ 1-3తో ఓడటంతో జర్మనీనే గెలిచింది.

## నీళ్లు కావాలి మొర్రో!

పుణె:భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టుకు వేదికైన పుణె స్టేడియంలో అభిమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చింది. తమ అభిమాన క్రికెటర్లను ఆటను ఆస్వాదిద్దామనుకుని వచ్చిన ప్రేక్షకులకు పట్టపగలే నరకం కనిపించింది. ఓవైపు దంచికొడుతున్న ఎండకు బేజారైన ఫ్యాన్స్‌కు కనీసం త్రాగేందుకు నీళ్లు కూడా దొరకని పరిస్థితి ఎదురైంది. స్టాండ్లకు పైకప్పు లేకపోవడంతో అభిమానులు ఎండకు విలవిలలాడాల్సి వచ్చింది. దీనిపై సోషల్‌మీడియాలో టీమ్‌ఇండియా ఫ్యాన్స్..మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ)తో పాటు బీసీసీఐ వైఖరిని తప్పుబడుతూ తీవ్ర స్థాయిలో విమర్శలు ఎక్కుపెట్టారు.

# అదిరిందయ్యా సుందర్

**ఏడు వికెట్లతో చెన్నై చిన్నోడు విజృంభణ • తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 259 ఆలౌట్ • అశ్విన్‌కు మూడు వికెట్లు • భారత్ 16/1**

**పుణె వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. బెంగళూరు టెస్టులో భారీ ఓటమితో వెనుకంజలో ఉన్న టీమ్‌ఇండియా సిరీస్‌లో పుంజుకోవాలన్న పట్టుదలతో బరిలోకి దిగితే..దీటైన పోటీనిచ్చేందుకు కివీస్ సిద్ధమైంది. స్పిన్‌కు సహకరిస్తుందన్న అంచనాలను నిజం చేస్తూ తొలి రోజే యువ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ధాటికి కివీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 259 పరుగులకు ఆలౌటైంది. సీనియర్ స్పిన్నర్ అశ్విన్ వికెట్ల వేట మొదలు పెడితే..చాలా రోజుల తర్వాత టెస్టు టీమ్‌లోకి వచ్చిన సుందర్ ఏడు వికెట్లతో విజృంభించాడు. కివీస్ బ్యాటర్లకు తన స్పిన్ తంత్రంతో కళ్లెం వేస్తూ టీమ్ ఇండియాను పోటీలోకి తీసుకొచ్చాడు. సుడిగాలి స్పిన్‌తో వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టి కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు సొంతం చేసుకున్నాడు. కివీస్‌ను కట్టడి చేశామన్న ఆనందం భారత్‌కు ఎక్కువసేపు నిలువలేదు. తొలి ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్ ఇండియా..కెప్టెన్ రోహిత్ వికెట్ కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. రెండో రోజు ఆటలో భారత బ్యాటర్లు ఎలా రాణిస్తారనే దానిపై మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.**



సుందర్ (7/59)

పుణె: భారత్, న్యూజిలాండ్ మధ్య పుణె వేదికగా జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు ఆటలో రోహిత్ సేన పూర్తిస్థాయి ఆధిపత్యం ప్రదర్శించింది. స్పిన్‌కు అనుకూలించిన పుణె పిచ్‌పై చెన్నై చిన్నోడు వాషింగ్టన్ సుందర్ (7/59) ఏడు వికెట్లతో విజృంభించాడు. సుందర్ తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేయడంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కివీస్ 79 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ అయింది. సుమారు మూడేండ్ల తర్వాత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న అతడి మాయాజాలానికి పర్యాటక జట్టు బ్యాటర్లు క్రీజులో నిలువలేకపోయారు. డెవాన్ కాన్వే (76), రచిన్ రవీంద్ర (65), మిచెల్ శాంట్నర్ (33) ఆ జట్టును ఆదుకున్నారు. సుందర్‌తో పాటు సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (3/64) రాణించడంతో కివీస్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్‌ఇండియా.. ఆదిలోనే రోహిత్ శర్మ(0) వికెట్ కోల్పోయి మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 16 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (6 నాటౌట్), శుభ్‌మన్ గిల్ (10 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

### ఆరంభంలో అశ్విన్..

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కివీస్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. భారత్ మూడు మార్పులతో బరిలోకి దిగింది. కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్‌ను పక్కన బెట్టి గిల్, ఆకాశ్ దీప్, వాషింగ్టన్‌తో బరిలో నిలిచింది. ఆరంభ ఓవర్లలో పేసర్లు పెద్దగా ప్రభావం చూపకపోవడంతో 8వ ఓవర్లోనే రోహిత్.. అశ్విన్‌కు బంతినిచ్చాడు. ఆ ఓవర్ ఐదో బంతికే అశ్విన్.. కివీస్ సారథి టామ్ లాథమ్ (15)ను వికెట్ల ముందు బలిగొనడంతో ఆ జట్టు తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం కొద్దిసేపటికే విల్ యంగ్ (18) వికెట్ల వెనుక పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. అయితే కాన్వేకు రచిన్ తోడవడంతో ఈ ఇద్దరూ భారత స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. లంచ్ తర్వాత బుమ్రా వేసిన తొలి ఓవర్లోనే మూడు బౌండరీలు బాది అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మూడంకెల స్కోరు దిశగా సాగుతున్న అతడు 44వ ఓవర్లో అశ్విన్ వేసిన బంతి కాన్వే బ్యాట్‌కు ముద్దాడి పంత్ చేతిలో పడటంతో 62 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

### సుందర్ మాయ..

కాన్వే నిష్క్రమించినా డారిల్ మిచెల్ (18)తో కలిసి రచిన్ కివీస్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 59 పరుగులు జోడించారు. కానీ రెండో సెషన్ డ్రింక్స్ విరామానికి రెండు ఓవర్ల ముందు సుందర్ మాయ మొదలైంది. 60వ ఓవర్ తొలి బంతికే అతడు అద్భుతమైన డెలివరీతో రచిన్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. తన మరుసటి ఓవర్లోనే టామ్ బ్లండెల్ (3)నూ పెవిలియన్‌కు పంపడంతో ఇక అప్పట్నుంచి కివీస్ కోలుకోలేదు. డ్రింక్స్ తర్వాత రెండో ఓవర్లో మిచెల్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న వాషింగ్టన్.. గ్లెన్ ఫిలిప్స్ (9)ను బౌల్డ్ చేసి ఆ జట్టును మరింత దెబ్బకొట్టాడు. సౌథీ (5)ని ఔట్ చేసి తన కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. చివర్లో ధాటిగా ఆడిన శాంట్నర్ (33)ను బౌల్డ్ చేసి కివీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో వాషింగ్టన్ ఏడు వికెట్లు తీస్తే అందులో ఏకంగా ఐదుగురు బ్యాటర్లు క్లీన్‌బౌల్డ్ కావడం విశేషం.

**1** ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో సుందర్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన

**7** స్వదేశంలో టెస్టు ఆడుతూ తొలి రోజే స్పిన్నర్లకు పది వికెట్లు దక్కడం భారత్‌కు ఇది ఏడోసారి

### తమిళ తంబీల హవా

కివీస్‌తో టెస్టు ఆడుతూ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసిన భారత బౌలర్లలో సుందర్ నాలుగో స్థానంలో ఉన్నాడు. గతంలో శ్రీనివాస వెంకట్రాఘవన్ (8/72-1965), ఈఎఎస్ ప్రసన్న (8/76-1975), అశ్విన్ (7/59-2017), సుందర్ కంటే ముందున్నారు. పై నలుగురిలో ప్రసన్న మినహా మిగిలిన ముగ్గురూ తమిళనాడుకు చెందినవారే కావడం గమనార్హం.

### సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : 259 ఆలౌట్ (కాన్వే 76, రచిన్ 65, సుందర్ 7/59, అశ్విన్ 3/64)

భారత్ తొలి ఇన్నింగ్స్ : 16/1 (గిల్ 10, జైస్వాల్ 6, సౌథీ 1/4)




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.